## క్లుప్తంగా

### కటకం ప్రసాద్‌కు ఎంపీ బాలశౌరి పరామర్శ



**పెడన:** వైఎస్సార్ సీపీ సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్‌ను మంగళవారం మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి పరామర్శించారు. ప్రసాద్ స్వగృహానికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రసాద్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఎంపీ ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగకుమారి, కుమారుడు నాగబాబుతో ఎంపీ మాట్లాడి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రహమతున్నీసా, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల కృష్ణ, మాదివాడ రాము, బుర్రా మహేష్, కోడూరు శ్రీనివాసరావు, దైవపు రంగారావు, నిమ్మగడ్డ మధు, యర్రా ప్రతాప్, పేరిశెట్టి రవి, శ్రావణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టర్‌ను కలిసిన ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు

**చిలకలపూడి(మచిలీపట్నం):** కలెక్టర్ పి. రాజాబాబును మంగళవారం ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సభ్యులు కలిశారు. కలెక్టర్ బంగ్లాలో రాజాబాబును శాలువాతో సత్కరించి పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం సంఘ నాయకులు ఎస్సీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మద్దాల కృష్ణకుమార్, యేలేటి హనుమంతరావు, రేమళ్ల సునీల్‌కుమార్, కంచర్ల మహేష్, డేవిడ్‌రాజు, మేడిపల్లి నాగేశ్వరరావు, గుండాబత్తిన శామ్యూల్, సంపత్ పాల్గొన్నారు.

### భూ హక్కును సద్వినియోగం చేసుకోవాలి

**కోనేరుసెంటర్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కల్పిస్తున్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బందరు తహసీల్దార్ ఎం. శ్రీవిద్య అన్నారు. బందరు మండలం అరిసేపల్లి రెవెన్యూ పరిధిలో మంగళవారం జగనన్న శాశ్వత భూ హక్కు–భూరక్ష (రీ సర్వే) కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గడిచిన వంద ఏళ్లగా రాష్ట్రంలో రీ సర్వే జరిగిన దాఖలాలు లేవన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు భూమిపై శాశ్వత హక్కు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. రైతులు రెవెన్యూ సిబ్బందికి సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, మండల సర్వేయర్ రాజబాబు, వీఆర్వో మధుశేఖర్, గ్రామ ఇన్‌చార్జి చండిక అజయ్‌కుమార్, సచివాలయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

### ఆంజనేయునికి పూజలు

**మచిలీపట్నంటౌన్:** ఈడేపల్లిలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తురాలు అంబటి విజయలక్ష్మి 108 గారెలతో చేసిన దండను స్వామివారికి అర్పించారు. పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. భక్తులకు తీర్థప్రసాదాలు, గారెలు ప్రసాదంగా అందజేశారు.

### అలరించిన వేషధారణలు

**మచిలీపట్నంటౌన్:** కృష్ణాష్టమి పర్వదినాన్ని జవ్వారుపేట శ్రీ వేంకటేశ్వర ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు గోపిక, కృష్ణుల వేషధారణలో సందడి చేశారు. హిందూ కళాశాలల ప్లానింగ్ ప్రొఫెసర్ సింగరాజు భారతి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను అభినందించారు. చిన్నారుల తల్లిదండ్రులను, ఉపాధ్యాయినులను అభినందించారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఎం. సత్యనారాయణ, ఉపాధ్యాయినులు అనసూయ, సుగుణ పర్యవేక్షించారు.

### అదనపు కట్నం ఇవ్వలేదని.. ఇంట్లో సామగ్రి తీసుకువెళ్లాడు

**పెడన:** అదనపు కట్నం ఇవ్వలేదని ఇంట్లో ఉన్న సామగ్రిని భర్త తీసుకువెళ్లాడు. పెడన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెడన జయంతి కాలనీకి చెందిన చోడబోయిన ఝాన్సీ రాణి మొదటి భర్త చనిపోవడంతో రాజేష్‌ను మూడేళ్ల కిందట రెండో పెళ్లి చేసుకుంది. వీరు విడిగా కాపురం ఉంటున్నారు. అదనపు కట్నం తీసుకురావాలని భర్త రెండేళ్లుగా ఝాన్సీరాణిపై ఒత్తిడి చేస్తున్నాడు. దీంతో ఝాన్సీరాణి తాము అద్దెకు ఉంటున్న ఇంటికి తాళం వేసి వారం కిందట పుట్టింటికి వెళ్లింది. సోమవారం అద్దెకున్న ఇంటికి వెళ్లేసరికి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించింది. స్థానికులను ఆమె ఆరా తీయగా ఇంట్లో ఉన్న సామగ్రి అంతా భర్త రాజేష్ ఎత్తుకు వెళ్లాడని చెప్పారు. బాధితురాలు ఝాన్సీ పోలీసులను ఆశ్రయించి తన భర్త అదనపు కట్నం డిమాండ్ చేస్తున్నాడని, ఈ నేపథ్యంలోనే ఇంట్లో ఉన్న సామగ్రిని తీసుకువెళ్లాడని ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బందరు రూరల్ సీఐగా హబీబ్‌బాషా

**కోనేరుసెంటర్:** బందరు రూరల్ సీఐగా మహమ్మద్ హబీబ్‌బాషాను నియమిస్తూ ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రాజమండ్రి ట్రాఫిక్ విభాగంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ సీఐగా పదోన్నతి పొందిన హబీబ్‌బాషాను బందరు రూరల్‌కు బదిలీ చేసిన డీఐజీ రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న ప్రసన్నవీరయ్యగౌడ్‌ను వీఆర్‌లోకి పంపుతూ ఆదేశాలు జారీ చేశారు.

# ఆచార్య దేవోభవ

- ఘనంగా గురుపూజోత్సవం
- ఉపాధ్యాయులకు సన్మానాలు

**పెడన:** తండ్రి తరువాత గురువులే ప్రతి ఒక్కరికీ రోల్ మోడల్‌గా ఉంటారని, అంతటి పవిత్రమైన స్థానంలో ఉన్న గురువులు విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలిచి ఉన్నత సమాజాన్ని నిర్మించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవం పెడన, మచిలీపట్నం, అవనిగడ్డ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో వక్తలు మాట్లాడుతూ రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పలు చోట్ల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పెడన మండలంలోని పలువురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయిలో అవార్డులు అందుకోగా మరికొందరు ఉపాధ్యాయులను వారి పాఠశాలల్లోనే స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పెడన బీజీకే జెడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె. లక్ష్మీదేవిని పాఠశాల హెచ్ఎం ఎస్. ఉషా, కౌన్సిలర్ పిచ్చుక సతీష్‌బాబు, రైల్వే ఉద్యోగి ఎ. అశోక్‌కుమార్ ఘనంగా సన్మానించారు. స్థానిక కళాంజలి హైస్కూల్‌లో టీచర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సీహెచ్ హరిదాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని 2023 ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులు కొండలరావు, చైతన్య, శ్రీకాంత్, మౌలాలిలతో పాటు ప్రిన్సిపాల్ కె. దిలీప్ కుమార్, కరస్పాండెంట్ కె. ప్రసన్నలక్ష్మిలను సత్కరించారు.

**మంచి విద్యార్థులను అందించడమే లక్ష్యం..**

**మోపిదేవి:** మంచి విద్యార్థులను అందించడమే ఉపాధ్యాయుల లక్ష్యమని జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులను మంగళవారం సన్మానించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ రావి దుర్గావాణి మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలల్లో సెల్ ఫోన్ నిలిపివేసి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. విద్యార్థుల్లో ప్రేరణ కల్పించడం వల్ల బోధనలో ప్రశ్నించే తత్వం పెరుగుతుందన్నారు. అనంతరం మండల స్థాయిలో 15 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపీపీ వి. చినబాబు తదితరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, వైస్ ఎంపీపీ ఓ. చిన్నారిబాబు, సచివాలయ మండల కన్వీనర్ కె. సుబ్బారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ పి. బాబూరావు, ఎంఈఓలు బి. త్రిపుర సుందరి, ఎ. వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు. స్థానిక కొమ్మారెడ్డి ఉన్నత పాఠశాల, సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాఠశాల డైరెక్టర్లు కె. కిషోర్, సాబుజాన్‌లు ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.



బంటుమిల్లిలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంపీపీ తదితరులు



వక్కలగడ్డలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంపీడీఓ





బందరులో అవార్డులు పొందిన ఉపాధ్యాయినులను అభినందిస్తున్న భారతి

ఉపాధ్యక్షుడు కడవకొల్లు సీతారామాంజనేయులు, ఎంఈఓ విద్యాసాగర్, అడపా గురవయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వీర రవి గురుపూజోత్సవం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

**బంటుమిల్లి:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులు ప్రిన్సిపాల్ డాక్టరు ఎస్. జగన్‌మోహన్‌రావు, అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. తొలుత రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కృష్ణా యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికైన అధ్యాపకుడు డాక్టర్ సత్యరాజేష్‌ను అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. మండల

**ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి..**

**కృత్తివెన్ను:** మంచి ప్రవర్తన, నైతిక విలువలు పాటిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఈఓ–1 త్రిపుర సుందరి, ఎంఈఓ–2 ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంఆర్సీలో మండల పరిధిలోని వివిధ కాంప్లెక్స్‌లలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయులు ఉత్తమ సమాజ నిర్మాతలు**

**చల్లపల్లి:** ఉపాధ్యాయులు ఉత్తమ సమాజ నిర్మాతలని ఎంపీడీఓ చేకు చినరాట్నాలు అన్నారు. వక్కలగడ్డ ఎంపీయూపీ స్కూల్‌లో మంగళవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్‌కే నగర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయులను ఎంపీడీఓ రాట్నాలు, సర్పంచ్ వల్లూరు ఉమా, క్లబ్ అధ్యక్షులు మోపిదేవి వెంకటేశ్వరరావు, రాయపూడి రాధాకృష్ణ సన్మానించారు. క్లబ్ ఆధ్వర్యంలో చల్లపల్లి శివారు గంగులవారిపాలెం ఎంపీపీ స్కూల్, లక్ష్మీపురం శివారు శివరామదుర్గాపురం ఎంపీపీ స్కూళ్లలో ఉపాధ్యాయులను సత్కరించారు. చల్లపల్లి సాయినగర్‌లో ఎస్సార్‌వైఎస్సీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సత్కరించారు.

**చల్లపల్లి:** చల్లపల్లి పంచాయతీలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, నడకుదురు పంచాయతీలో సర్పంచ్ గొరిపర్తి సురేష్ బాబు, పాగోలు పంచాయతీలో సర్పంచ్ తోట శ్రీనివాసరావు, మంగళాపురం పంచాయతీలో సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, యార్లగడ్డ పంచాయతీలో సర్పంచ్ యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**ఉత్తమ ఉపాధ్యాయినులకు అభినందనలు..**

**మచిలీపట్నంటౌన్:** ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు విద్యాసంస్థల సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు పొందిన ఉపాధ్యాయినులను హిందూ కళాశాలల ప్లానింగ్ ప్రొఫెసర్ సింగరాజు భారతి మంగళవారం అభినందించారు. నగరంలోని జవ్వారుపేట శ్రీ వేంకటేశ్వర ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయినులు వి లక్ష్మీరాజ్యం, జె. నాగలక్ష్మి, సీహెచ్ సీతామహాలక్ష్మి, పి. ఉమామహేశ్వరి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరిని మంగళవారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో భారతి అభినందించారు. ప్రిన్సిపాల్ ఎం. సత్యనారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

**అవనిగడ్డ:** స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, నలుకుర్తి పృథ్వీరాజ్, నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. లలితాదేవి ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు, రిటైర్డ్ డెప్యూటీ తహసీల్దార్ ఎంవీ కృష్ణారావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు.



కళాంజలిలో సత్కారాలను అందుకున్న ఉపాధ్యాయులతో డాక్టర్ హరిదాస్ తదితరులు



మోపిదేవిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జెడ్పీటీసీ మల్లికార్జునరావు, ఎంపీపీ దుర్గావాణి



పెడన జెడ్పీ హెచ్ఎస్‌లో లక్ష్మీదేవిని సన్మానిస్తున్న కౌన్సిలర్ సతీష్‌బాబు తదితరులు



అవనిగడ్డ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రాధాకృష్ణన్‌కు నివాళి



ముక్కొల్లులో సత్కారాలు అందుకున్న ఉపాధ్యాయులు



కృత్తివెన్నులో సత్కారం పొందిన గురువులు

### ఘనంగా గురుపూజోత్సవం

**గూడూరు:** మల్లవోలులో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ గోవాడ ప్రశాంతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సత్కరించారు. ముక్కొల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సమ్మెట బాలశివరామప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు వై.శ్రీనివాసరావు, మహంకాళమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ సమ్మెట వేణుగోపాలరావులు ఉపాధ్యాయులను సత్కరించారు. అలాగే జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మండలంలోని పలువురు ఉపాధ్యాయులను మచిలీపట్నంలోని జెడ్పీ కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు సన్మానించారు.

## గడప గడపకు నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం

**పెదకళ్లేపల్లి(మోపిదేవి):** పెదకళ్లేపల్లిలో గడప గడపకు నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామని పంచాయతీ రాజ్ ఏఈ బి. శ్రీనివాస్ తెలిపారు. క్షేత్రస్థాయిలో పెద దళితవాడలో జరుగుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 20 లక్షలను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కేటాయించారని, ఈ నిధులతో స్థానిక ఎస్టీ, ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. పెద దళితవాడలో రూ. 8.40 లక్షలతో 155 మీటర్ల రెండు సీసీ రోడ్లు, ఎస్టీ కాలనీలో రూ. 1.60 లక్షలతో 30 మీటర్ల సీసీ రోడ్లు, అద్దంకి నాంచారమ్మ తల్లి ఆలయం నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు రూ. 10 లక్షలతో 75 మీటర్ల సీసీ రోడ్డు, చిన దళితవాడ 4వ వార్డులో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 7.50 లక్షలతో సీసీ రోడ్లు వేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో తోట కృష్ణాంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు

## విజయవాడ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ల అందజేత

**పెడన:** మడక గ్రామానికి చెందిన జన్ను రామతులసి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి 25 రోజులుగా విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. రామతులసికి పింఛను ఇచ్చేందుకు వలంటీర్ గ్రామానికి వెళ్లగా ఆమె విజయవాడ ఆస్పత్రిలోచికిత్స పొందుతున్నట్లు తెలిసింది. గర్భిణీ అయిన వలంటీర్ అంతదూరం వెళ్లలేక విషయాన్ని వెల్ఫేర్ అసిస్టెంట్ దృష్టికి తీసుకువెళ్లింది. దీంతో మడక సచివాలయంలో విధులు నిర్వహించే వెల్ఫేర్ అసిస్టెంట్ వి. స్వరూప మంగళవారం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి వింతంతు పింఛను అందజేశారు. ఇంత మంచి వ్యవస్థను ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లబ్ధిదారు రామతులసి కృతజ్ఞతలు తెలిపింది.

**కృత్తివెన్ను:** కృత్తివెన్ను మండలం మునిపెడ గ్రామానికి చెందిన ఈదా ఏసుదాసు విజయవాడలోని ఆస్పత్రిలో కంటికి ఆపరేషన్ చేయించుకుని చికిత్స పొందుతున్నాడు. ఈ నెల ఫించన్ అందజేసే సమయానికి ఆయన ఇంటికి వచ్చే పరిస్థితి లేదు. దీంతో వలంటీర్ కాకర సుప్రియ విజయవాడ ఆస్పత్రికి వెళ్లి ఏసుదాసుకు పింఛను సొమ్ము అందజేసింది. పింఛనుదారు ఆనందం వ్యక్తంచేశాడు.



రామతులసికి పింఛను అందజేస్తున్న స్వరూప



విజయవాడ వెళ్లి పింఛను అందజేస్తున్న సుప్రియ

## ఓటర్ల జాబితా సవరణకు సహకరించండి

**ఆర్డీఓ పద్మావతి**

**గుడివాడ టౌన్:** గుడివాడ నియోజకవర్గంలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమానికి రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్డీఓ పి.పద్మావతి కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డోర్ టు డోర్ సర్వే 99 శాతం పూర్తయిందన్నారు. వాటిపై అభ్యంతరాలు, ఇతర సమాచారంపై చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తమకు గల సందేహాలను వివరించాలన్నారు. తుది జాబితా పూర్తయిన తరువాత తొలగింపులకు ఆస్కారం ఉండదని కొత్త ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ అన్నారు. జాబితాలకు తుది మెరుగులు దిద్దుతున్న నేపథ్యంలో రాజకీయపార్టీల ప్రతినిధులు సహకరించాలని ఆమె కోరారు. తహసీల్దార్ కె. ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ ప్రతినిధులు కె.ఆంజనేయ ప్రసాద్, వీరిశెట్టి నరసింహారావు, టీడీపీ ప్రతినిధులు దింట్యాల రాంబాబు, పెద్ది వీరభద్రరావు, జనసేన, ఇతర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ పద్మావతి

## పోషకాహారంతో రక్తహీనత దూరం

**పామర్రు:** పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే రక్తహీనత ఉండదని సూపర్‌వైజర్ అనిత పేర్కొన్నారు. పోషణ్ మహా కార్యక్రమంలో భాగంగా పోషక విలువలుగల ఆహారంపై స్థానిక సాయినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ గుడ్డు, పాలు తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. ఎస్.శ్రీదేవి, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

**తోట్లవల్లూరు:** పౌష్టికాహారంతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందని ఉయ్యూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత సూచించారు. పోషణ మహాలో భాగంగా స్థానిక ఎస్టీ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఆకుకూరలు, పప్పు, పాలు, గుడ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ కిట్లు సుజాత అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### మణిపూర్ ఘటనల్లో నిందితులపై చర్యలు తీసుకోవాలి

**పెడన:** మణిపూర్ ఘటనల్లో నిందితులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. పట్టణంలోని అర్బన్‌హెల్త్ సెంటర్ వద్ద ఆశా వర్కర్లు మంగళవారం నిరసన తెలిపారు. వీరికి సీఐటీయూ మద్దతు ఇచ్చింది. సీఐటీయూ నాయకుడు పి. నరసింహారావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తోందని దుయ్యబట్టారు. బీజేపీ యేతర రాష్ట్రాలలో విధ్వంసం సృష్టిస్తోందని ఆరోపించారు. మణిపూర్‌లో ఘోరంగా మహిళలను చిత్రహింసలకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా బీజేపీ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు విశాలాక్షి, లక్ష్మి, ధనలక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

### నగరంలో 98.77 శాతం పింఛన్ల పంపిణీ

**మచిలీపట్నంటౌన్:** మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారానికి 98.77 శాతం పూర్తి చేశారు. నగరంలో 18,669 పింఛన్లకు గానూ 18,439 పింఛన్లను పంపిణీ చేశారు.

### ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

**తోట్లవల్లూరు:** జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు మరింత వేగవంతం చేయాలని జిల్లా హౌసింగ్ ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యనారాయణ ఆదేశించారు. కుమ్మమూరు జగనన్న కాలనీలో మంగళవారం పర్యటించారు. ఎస్టీ లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలపై సూర్యనారాయణ ఆరా తీశారు. మొత్తం 8 మందికి ఇళ్లు మంజూరుకాగా ఐదుగురు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారని తెలిపారు. మిగిలిన లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. ఆయన వెంట హౌసింగ్ ఈఈ నిరీక్షణరావు, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, సర్పంచ్ బొమ్మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఏఈఈ భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### రూ. 1.70 కోట్లతో ఫంక్షన్ హాల్ నిర్మాణం

**పెదకళ్లేపల్లి(మోపిదేవి):** పెదకళ్లేపల్లి తూర్పు వీధిలో నూతనంగా రూ. 1.70 కోట్లతో సినీ పాటల రచయిత, స్థానికులు వేటూరి సుందర రామ్మూర్తి పేరున ఫంక్షన్ హాల్ నిర్మించనున్నామని పంచాయతీరాజ్ డీఈ బి. వెంకటేశ్వరరావు తెలిపారు. తూర్పువీధిలోని అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో కేటాయించిన స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఎంపీ నిధులు రూ. 50 లక్షలు, రాజ్యసభ సభ్యులు పరిమళ్ నత్వాల్ నిధులు రూ. 50 లక్షలతో పాటు సీఎస్ఆర్ గ్రాంటు రూ. 70 లక్షలతో భవన నిర్మాణం చేపట్టనున్నామని చెప్పారు. మొదటి విడతగా గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణానికి రూ. 1 కోటి మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో గ్రామ కన్వీనర్ గండు దుర్గారావు, అద్దంకి నాంచారమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ గండు సాంబశివరావు, తోట కృష్ణాంజనేయులు, విశ్రాంత ఈఓపీఆర్డీ గండు సత్యనారాయణ, పంచాయతీరాజ్ మండల ఏఈ బి. శ్రీనివాస్, వాసు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

**మచిలీపట్నంటౌన్:** 11వ డివిజన్‌లో మంగళవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. రోడ్ల వెంబడి ఉన్న పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించి ట్రాక్టర్ల సాయంతో డంపింగ్‌యార్డుకు తరలించారు. కార్పొరేటర్ గూడవల్లి నాగమణి, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ గూడవల్లి నాగరాజు పర్యవేక్షించారు.

## పక్కాగా ఓటర్ల జాబితా ప్రక్రియ

**జిల్లా కలెక్టర్ రాజాబాబు**

**కోనేరుసెంటర్:** జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం పక్కాగా జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. మంగళవారం ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి బందరు నియోజకవర్గంలో తొలగించిన ఓట్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో 1400 మంది ఓటర్లకు మించకుండా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రతి ఓటరుకు ఇంటి నెంబర్ ఉండాలని, ఏ ఇంటి నంబరు ఏ పోలింగ్ కేంద్రంలో వస్తుందో పక్కాగా సమాచారం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని 201 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి వాటి స్థితిగతులను పరిశీలించాలని చెప్పారు. సరిగా లేనిచోట పోలింగ్ కేంద్రం మార్పునకు ప్రతిపాదనలు పంపాలన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలు, శాశ్వత సరిహద్దులు వివరించే రేఖాచిత్రాన్ని కంప్యూటర్‌లో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మృతిచెందిన, శాశ్వతంగా వలసపోయిన, ఒకరికి ఒకటి కంటే ఎక్కువ ఉన్న ఓట్లకు సంబంధించి తొలగించిన ఓటర్ల రికార్డులను పరిశీలించామని చెప్పారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బందరు ఆర్డీఓ ఐ. కిషోర్, మున్సిపల్ కమిషనర్ చంద్రయ్య, తహసీల్దార్ శ్రీ విద్య, సిబ్బంది పాల్గొన్నారు.



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజాబాబు

## కాలనీల అభివృద్ధికి కృషి

**పేర్ని కిట్టు**

**మచిలీపట్నంటౌన్:** నగరంలోని పలు కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. స్థానిక 7వ డివిజన్ చిలకలపూడిలోని వసంతరావు బడ్డీకొట్టు ప్రాంతంలో నూతనంగా రూ. 1.84 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రెయిన్ పనులను మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి ఆయన ప్రారంభించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా విడుదలైన రూ. 20 లక్షల నిధులతో ఈ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. రానున్న రోజుల్లో అన్ని డివిజన్లలో సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, కార్పొరేటర్ వడమట రేవతి, కమిషనర్ జి. చంద్రయ్య, కో–ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసి, కార్పొరేటర్లు మాచవరపు రాంప్రసాద్, ఐనం తాతారావు, వైఎస్సార్ సీపీ నాయకులు బూరగ రామారావు, మరీదు నాగరాజు పాల్గొన్నారు.



డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ చిత్రంలో పేర్ని కిట్టు

### స్వచ్ఛ చల్లపల్లికి విరాళాలు

**చల్లపల్లి:** స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమానికి పలువురు విరాళాలు అందించారు. మోపిదేవి మండలం మెరకనపల్లికి చెందిన బండి భూషయ్య రూ.10వేలు విరాళాన్ని స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ తరిగోపుల పద్మావతిలకు అందచేశారు. మల్లంపల్లి పుష్పాంజలి రూ.2 వేలు విరాళం అందజేశారు.